


# ప్రభుత్వ పథకాలు మీ అయ్య జాగీరు కాదు

## కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఫైర్

ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూధన్ నేడు నెలకొండపల్లి మండలం, ముజ్జుగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి తో పాల్గొన్నారు. తాతా మధుసూదన్ మాట్లాడుతూ, “సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ గుర్తుల పైన కాకుండా, పార్టీలకు



అతీతంగా జరుగుతాయి. కానీ, ప్రస్తుతం జరుగుతున్న ఏ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేలు, మంత్రులు, పోలీసుల జోక్యం లేకుండా లేదు. గ్రామంలో వీరు ఇన్వాల్వ్ అయి కనీసం వార్డు మెంబర్లను కూడా బెదిరించే పరిస్థితికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోటీ చేసేవారి మీద రకరకాల ఇబ్బందులు పెట్టి వేధిస్తున్నారు.” “ఇలాంటి కోణంలోనే ఇక్కడ (ముజ్జుగూడెంలో) జరగనటువంటి ఒక కుట్రకు తెర లేపారు. ‘ఎవరో మా ఇళ్ల మీదకు వచ్చి రాళ్లు వేశారు, ఏదో చేశారు’ అని కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి నిందలు వేసి, మన మండల పార్టీ అధ్యక్షులను అరెస్ట్ చేసే పరిస్థితికి తీసుకొచ్చారు. కానీ, అసలు ఆ విషయం జరగలేదు అని పోలీస్ వారు కూడా తేల్చి చెప్పారు.” “ప్రభుత్వ పథకాలు మీ అయ్య జాగీరు కాదు, గతంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, ప్రభుత్వం ప్రతి అర్హులకు లాటరీ పద్ధతిలో పథకాలను ఇచ్చి, ప్రతి పార్టీ వారికి అందించింది. కానీ ఇప్పుడు, వారు కాంగ్రెస్ పార్టీలో తిరిగే వారికి తప్ప ఎవరికీ రాకూడదు అనే అలవాటు తీసుకొచ్చారు.” “ముగ్గురం మంత్రులం ఉన్నాం, ‘వార్ వన్ సైడ్’ లాగ, వన్ సైడ్ ఓటింగ్ జరిగి మేమే గెలుచుకుంటాం అని మంత్రులు అనుకుంటున్నారు. నిజానికి, ఈ రెండు సంవత్సరాల్లో వన్ సైడ్ అయ్యారు, అదే మా వైపు.”

“ఇలాంటి అప్రజాస్వామిక పరిస్థితిలో గ్రామ ప్రజలు ప్రశాంతంగా ఉండాలి. ఇక్కడ జరిగిన ప్రతి అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీ ద్వారా మాత్రమే జరిగింది. “కాంగ్రెస్ వారు ఈ గ్రామానికి ఏం చేసారు అని చెప్పి ఓట్లు అడగండి, మేము చెప్తాం మేము ఏమి అభివృద్ధి చేశాం అనేది.” ఈ కార్యక్రమంలో పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి, నేలకొండపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఉన్నాం బ్రహ్మయ్య, సిపిఎం నాయకులు బండి రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

### రామకృష్ణాపురంలో కాంగ్రెస్ ‘దొంగ పనులు’.. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ధ్వజం

### జిత్తులమారి రాజకీయాలు.. జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు



స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చింతకాని మండలం, రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలో నిర్వహించిన భారీ ర్యాలీ, సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక, జిత్తులమారి రాజకీయాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాతా మధుసూదన్ గారు మాట్లాడుతూ, రామకృష్ణాపురం గ్రామం ఎంతో ఔన్నత్యం, ఘన చరిత్ర కలిగినదని, అటువంటి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ దౌర్భాగ్యమైన పనులకు పాల్పడుతోందని ఆరోపించారు. “రామకృష్ణాపురం ప్రజల ఓటు హక్కును అపహరించాలని కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసింది. ఏకంగా 74 మంది ఓట్లను ఖమ్మం నగరానికి అక్రమంగా ట్రాన్స్‌ఫర్ చేసి, ఆ 74 మంది ఇక్కడ ఓటు వేయకుండా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందాలని ఒక జిత్తులమారి పని చేశారు” అని తీవ్రంగా విమర్శించారు. “మీకు దమ్ము, ధైర్యం ఉంటే, ధైర్యంగా ప్రజలను ఎదుర్కొని గెలవాలి. కానీ, ఓటర్లను అపహరించి, ఇటువంటి దొంగ పనులతో గెలవాలని అనుకోవడం మాత్రం ఏ మాత్రం సబబు కాదు. కేవలం ఓట్లు మార్చడానికి ఒక ఆపరేటర్‌ను పెట్టుకుని ఇటువంటి దిక్కుమాలిన పని చేయడం ఎంతవరకు కరెక్ట్?” అంటూ కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు, కుట్రలు చేసినా, ఈ ఎన్నికల్లో రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలో ఎగరబోయేది మాత్రం మిత్రపక్షాల జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు అనుసరిస్తున్న నీచ రాజకీయాన్ని ఆయన ఎండగట్టారు. “ఈ దేశంలో అత్యంత ఎక్కువ ఓటర్లు ఉండే పదవి ప్రధానమంత్రిది. అత్యంత తక్కువ ఓటర్లు ఉండే వారు వార్డు మెంబర్. అటువంటి వార్డు మెంబర్‌ను కూడా ఎమ్మెల్యేలు, ఎస్ఐలు, సీఐలు, ఏసీపీలు పిలిచి బెదిరించి, వార్డు మెంబర్‌గా వేసిన నామినేషన్‌ను వెనక్కి తీసుకోమని చేసే ఈ దొంగ చర్యలు చాలా అవమానకరం” అని మండిపడ్డారు. “మీకు వచ్చిన పదవికి మీరు దానికి వన్నె తెచ్చే విధంగా ఉండాలి. కానీ, ఈ విధమైన కుళ్ళు కుతంత్రాలతో కూడిన రాజకీయం చేయకూడదు” అని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు. ఈ రోజు మిత్రపక్షాలు అందరూ ఏకమై, గ్రామం అంతా కలిసి ఇటువంటి నక్క బుద్ధి కలిగిన కాంగ్రెస్ పార్టీని ఓడించాలని ఆయన ప్రజలను కోరారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను తాతా మధుసూదన్ పోల్చి చూపారు. “కాంగ్రెస్ పార్టీ ఈ చింతకాని మండలానికి కానీ, రామకృష్ణాపురం గ్రామానికి కానీ ఏం చేసిందని ఓట్లు వేయాలి? ఈ రెండు సంవత్సరాల్లో మీరేం చేశారో కూడా ప్రజలు చూశారు” అని వ్యాఖ్యానించారు. కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దయనీయ పరిస్థితి నుండి, తెలంగాణలో పూర్తిగా 24 గంటల నిరంతర కరెంటు ఉండేలా చేసిన ఘనత కేసీఆర్ గారికి మాత్రమే దక్కుతుంది. దళిత బంధు, ఆసరా పెన్షన్లు (వృద్ధాప్య, వితంతు), కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందించాం. ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా ఉచితంగా సురక్షితమైన తాగునీరు ఇచ్చాం. గ్రామాలను బాగు చేశాం. ఈ రోజు బ్లీచింగ్ కొట్టించడానికి కూడా వెనకడుగు వేస్తూ, ప్రతి గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలడానికి ముఖ్య కారణం కాంగ్రెస్ నేతలే అయ్యారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు టైర్లు పోతే వేయించలేని దయనీయ పరిస్థితి. పారిశుధ్యం పూర్తిగా అటకెక్కింది. కాంగ్రెస్ పార్టీ విలువ రోడ్డున పడింది. “మేము చేశాము. మేము అడుగుతాము. ఓటు అడిగే హక్కు మాకు మాత్రమే ఉంది” అని గట్టిగా నొక్కి చెబుతూ, మిత్రపక్షాల అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన గ్రామస్తులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జి లింగాల కమల్ రాజు, సిపిఎం నాయకులు వాక సీతారాంరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు బొడ్డు వెంకట రామారావు, మంకెన రమేష్, హనుమంతరావు, గ్రామ శాఖ అధ్యక్షులు పిన్నెల్లి శ్రీనివాస్ రావు, తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.